# అనుబంధం

**-రాపేటి రామకృష్ణారావు**

ఆ రోజు పొలంలో పనుల వత్తిడి వల్ల రామస్వామి నాయుడికి చాలా ఆలస్యమైంది. చీకటి బాగా పడిపోయింది. పౌర్ణమి వెళ్లిన తరువాతి రోజులు. ఆకాశం నిర్మలంగా వున్నా అక్కడక్కడ తెల్లని మేఘాలు. కదులుతున్నవి మేఘాలైనా చంద్రుడే మేఘాలకెదురీతున్నట్లు కనిపిస్తున్నాడు.

తపేళాలో ఆవుపాలు పితికి ఉట్టిలో వుంచి పట్టుకుని వూరివేపు బయలుదేరాడు. ఊరి పొలిమేరలో గెడ్డ వుంది. అది తేటదేరి మోకాటి లోతు నీటితో ప్రవహిస్తున్నది. గెడ్డ దాటాడు. గంగమ్మ మదిలో మెదిలింది. త్వరగా పాలు యింట్లో యిచ్చేసి వెళ్ళి కలుసుకోవాలి అనుకుని నడక వేగం పెంచాడు.

అంతే గుండెల్లో ఏదో పీకినట్లయింది. అంతలోనే ఒళ్లు చెమటలు కమ్మింది.

''అమ్మా! గుండెల్లో నొప్పి'' అని గుండె పట్టుకుని అడ్డంగా పడిపోయాడు.

వెనక పొలాల నుంచి వస్తున్న రైతులు ఎత్తుకుని తీసుకువచ్చారు.

నాయుడుగారిది లంకంత యిల్లు. చుట్టూ ఎత్తయిన ప్రహరీగోడ. మధ్యలో యింటి చుట్టూ వెయ్యి చదరపు గజాలకి పైగా స్థలం. గేటులోనుంచి పెద్ద పెద్దలారీలు కూడా వెళ్ళి వస్తుంటాయి. నాయుడ్ని యింటి ముందు భాగంలోని పెద్ద వరండా దాటించి నడవ గదిలోని మంచం మీద పడుకోబెట్టారు.

డాక్టరుకి కబురంది వచ్చాడు. అని పరీక్షలూచేసి గుండెపోటు అని నిర్ధారించి యింజక్షనిచ్చాడు. నాలుక కింద వుంచుకొమ్మని టేబ్లెట్లు యిచ్చాడు.

ఇంట్లో అందరూ ఘొల్లున ఏడ్పులు.

డాక్టరుగారు నాయుడిగారి అబ్బాయిని లోపలి గదిలోనికి తీసుకెళ్ళి ''ఎందుకేనామంచిది దగ్గర బంధువుల్ని పిలిపించండి'' అని చెప్పి వెళ్ళిపోయాడు.

నాయుడికి తన పరిస్థితి తెలిసిపోయింది. రేపోమాపో అని అర్థం చేసుకున్నాడు. తనకి మిగిలివున్న బాధ్యతలేమీ లేవు. అన్నీ నెరవేర్చాడు. భార్య వుండగానే కొడుకూ కూతుళ్లిద్దరికీ పెళ్ళిళ్ళు చేశాడు. తను సంపాదించిన ఆస్తితోనే తన సంతతి హాయిగా బ్రతకగలరు. కొడుకుకి చదువబ్బలేదు. ఇంటర్ ఫెయిలయ్యాడు. ఇంక చదవననేశాడు. పెళ్ళి చేశాడు. పొలం పనుల్లో పడిపోయాడు. ఓ కొడుకునీ కూతుర్నీ తనలాగేకన్నాడు.

మనవడు తెలివైన వాడు. పెద్దచదువులు చదివి యింజనీరై హైదరాబాదులో వుద్యోగం చేస్తున్నాడు. తనంటే ప్రాణం. హైదరాబాదు వచ్చి వుండమంటాడు. తనేమో వూరు వదిలి వుండలేడు. వాడికి ఇంకా పెళ్లి కాలేదు. ఆ పెళ్ళి బాధ్యత తనది కాదు. గంగమ్మ జ్ఞాపకం వచ్చింది. ఒకే ఒక్క బాధ్యత మిగిలి వుంది. దానికే ఏదో చెయ్యాలి.

నాయుడిగారి ఆలోచనలు జీవితంలో చాలాకాలం వెనక్కి వెళ్ళిపోయాయి. సినిమాలాగ మనోఫలకం మీద గత స్మృతులు దృశ్యాలుకట్టాయి. అప్పటికింకా తనకి పెళ్ళి

> గంగమ్మ వ్యవహారం వాళ్ళ యింట్లో మొదట తెలియకపోయినా తరవాత తెలిసింది. శుభ్రమైన చీరలు వాళ్ళ యింట్లోకి కావలసిన వాటినెన్నిటినో నాయుడు సమకూర్చాడు. పేదరికం వాళ్ళ నోరు నొక్కింది. అయినా గంగమ్మ భవిష్యత్తు ఏమౌతుందోనని భయపడ్డారు. నాయుడికి పెళ్ళి జరిగి పిల్లలు పుట్టిన తరవాత ఒక సంబంధం చూసి బలవంతంగా సింహాచలం కొండమీద గంగమ్మకి పెళ్ళి చేశారు.

కాలేదు. వూళ్ళోని హైస్కూలులో ఎనిమిదోక్లాసో తొమ్మిదో క్లాసో చదువుతున్నాడు. చదువు మీద అంత శ్రద్ధలేదు. పొలంలో పనులున్నప్పుడు స్కూలు ఎగ్గొట్టి తండ్రికి సాయంగా పనులు చేయించేవాడు. అప్పుడే గంగమ్మతో ప్రేమలో పడ్డాడు. గంగమ్మ పేద పిల్ల. మట్టిలో మాణిక్యం. కూలికి వెళ్ళి నాలుగు డబ్బులు తెచ్చి యింట్లో యిస్తేనేగాని గడవని పరిస్థితి. సోగకళ్ళు చక్కని పలువరస, తెల్లని చందమామలాంటి గుండ్రని ముఖం. ఎంతో అందంగా వుండేది. గంగమ్మ కూడా నాయుడ్ని ఎంతోయిదిగా ప్రేమించింది. కులాలు వేరు. పెళ్ళి అనే మాట వాళ్ళ మనసుల్లో లేదు. తోడుగా వుండాలి. ఒకరికోసం ఒకరు బతకాలి అనేదేవాళ్ళ తపన.

వాళ్ళ ప్రేమ కళ్ళు మాట్లాడుకోవడంతో మొదలైంది. తరువాత నవ్వులు పలకరింపులు. తరవాత అంతులేని కబుర్లు గంగమ్మలో మాట్లాడడానికి మాటలు వూరేవి. ఆమె కబుర్లు వినడానికి చెవులూరేవి. ఆమె లేకపోతే కాలం ఆగిపోయేది. ఇన్ని జరిగినా వాళ్ళు లోకం దృష్టిలో పడలేదు. అదే గంగమ్మ తీసుకున్న జాగ్రత్త. లోకం మైమరచి నిద్రపోతున్నప్పుడు వాళ్ళు లేచేవారు. వేకువజాము దాకా ఏ వాగు పక్కనో, ఏ చెరువుగట్టునో కూర్చుని వూసులాడుకునేవారు. పులీపుట్రా పాముపురుగూ లాంటివి వస్తాయేమోనన్న వూహ కూడా వాళ్ళకి వచ్చేదికాదు. చాలాకాలం దాకా ముద్దులు ఆలింగనాలతోటే సరిపెట్టుకున్నారు. శరీరాన్ని మలినం చేసుకోలేదు.

ఆరోజుల్లోనే ఒక రోజు నాయుడు ''ఇలాగ ఎన్నాళ్లే గంగమ్మా. మనం ఎట్లైనా లేచిపోదాం. మనకి పెళ్ళా అవదు. పుట్టి పుణ్యానికి నన్ను నువ్వూ నిన్ను నేనూ సూసుకోడవేనేటి'' అని మళ్ళీ ''నువ్వు వూ అనంటే నేను రెడీ'' అని ముగించాడు.

''ఇదుగో నాయుడూ నానిప్పుడే సెప్తుతున్నాను. మనకి పెళ్ళీ వొద్దు. పెటాకులూ వొద్దు. ఇలాగే వుందాం. ఎక్కడికో నేసి పోయే కరమ నీకేటి. ఈ దిక్కుమాలిన దాని కోసం సెడ్డపేరు తెచ్చుకుంటావా?'' అంది. లోకం తీరు తెలియని అమాయకపు ప్రాణి గంగమ్మ.

నాయుడికి కొంత తెలుసును ''మనల్ని యిలాగుండనిస్తాదేటే లోకం ఎర్రిపిల్లా. నీకు మీ వోళ్ళూ, నాకు మావోళ్ళూ పెళ్ళి సేసెయ్యరా'' చెప్పాడు.

''నువ్వు సేసుకుంటే సేసుకో. నాను మాతరం నీ పేరు మీదే యిలాగే వుండిపోతాను'' అనేసింది.

మంచం మీద నాయుడిగారి కళ్ళు చెమ్మగిల్లాయి. నేటికీ అలాగే తన పేరుమీదే వుండిపోయింది. మనసు బాధతో మూలిగింది. ఈ బాధ ముందు గుండెల్లో నొప్పి ఎన్నోవంతు అనుకున్నాడు. తరువాత తమ జీవితాలలో ఎన్నో మరపురాని సంఘటనలు.

అనుకున్నట్లే తనకి పెళ్ళయిపోయింది. ఆరోజుల్లో చిన్నప్పుడే పెళ్ళిళ్ళు. గంగమ్మకి మాత్రం పెళ్ళి కాలేదు. ఎన్నో సంబంధాలు వచ్చేవి. చేసుకునేది కాదు.

భార్యతో కాపురం యాంత్రికం. మొదటి ప్రేమ మొదటిదే. పెళ్ళయినా గంగమ్మతోటి తిరుగుళ్ళు మానలేదు. అనకాపల్లిలో లేక విశాఖపట్నంలో ఎక్కడ తనకి పనిపడినా గంగమ్మకి చెప్పేవాడు. ఇద్దరూ చిలకా గోరింకల్లాగ ఏ లాడ్జిలోనో కలిసి వుండేవారు. సినిమాలూ షికార్లూ, భార్య దగ్గర పొందలేని ఆత్మానందం గంగమ్మ దగ్గర పొందేవాడు.

ఇలాంటి విషయాలు దాగవు. ఆనోటా యీనోటా నాయుడిగారింట్లో తెలిశాయి. పెద్ద రాద్ధాంతం చెయ్యడం వల్ల లాభం లేదని తెలిసిపోయింది. అందరూ తెలిసీ తెలి



యనట్లూరుకున్నారు. నాయుడుగారి భార్య సూటిపోటి మాటలతో చాలామార్లు నాయుడిగార్ని భయపెట్టింది. పుట్టింటికి వెళ్ళిపోయేది. మళ్ళీ తనే వచ్చేది.

నాయుడు భార్యతో ''నువ్వు నా పెళ్ళానివి. నీకేలోటూ రాదు. నేను గంగమ్మని వదల్ను. నన్నే నమ్ముకుని వుంది. ఇలాగే వుండడం నీకిష్టం లేకపోతే నీతోవ నువ్వు చూసుకో'' అని తెగేసి చెప్పేశాడు.

నాయుడుకి భార్యతో కొడుకూ ఓ కూతురూ పుట్టారు. గంగమ్మకి పిల్లల్ని కనడం యిష్టం లేదు. కారణం తనొక తాళిలేని భార్య. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఒక మారు గంగమ్మ నెలతప్పింది. ఆ మాట నాయుడికి విశాఖపట్నంలో వాళ్ళు ఏకాంతంలో వున్నప్పుడు చెప్పింది.

''మరైతే ఏం చేద్దాం. వుంచేసుకో. నా పిల్లలని చెప్పడానికి నాకేం అభ్యంతరం లేదు.'' అన్నాడు నాయుడు.

''నాకలాగిష్టం నేదు. నువ్వు నన్ను పెళ్ళి నేసుకుంతేనే నాకు పిల్లలు. ఆ పని సెయ్యగలవా? సెయ్యనేవు. మరెందుకు పోనీనే'' అని కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

''ఒక పెళ్ళి చేసుకుని పెళ్ళాం వుండగా మరో పెళ్ళి చేసుకోగూడదు. ఎలాగో ఏటో'' దిగులుగా అన్నాడు.

నాయుడు బాధపడ్డం గంగమ్మకిష్టం వుండదు.

గుండెలమీద వాలిపోయింది. నాయుడి గుండెలుని మురుతూ ''నువ్వు బాధపడకు. నాకోసం పెల్లాన్ని దూరం నేసుకుంటావా? ఎవులు పిల్లలు ఎవుల్నోకం. నీ పిల్లలు నా పిల్లలు కారా. కడుపు తీయించేసుకుంటాను'' అనేసింది.

తెలిసిన డాక్టరు దగ్గరికి గంగమ్మని తీసుకుని వెళ్ళి అబార్షను చేయించేశాడు నాయుడు. నాయుడ్ని యిబ్బందుల్లోకి తోసే ఏపనీ గంగమ్మ చెయ్యలేదు.

గంగమ్మ వ్యవహారం వాళ్ళ యింట్లో మొదట తెలియక పోయినా తరవాత తెలిసింది. శుభ్రమైన చీరలు వాళ్ళ యింట్లోకి కావలసిన వాటినెన్నిటినో నాయుడు సమకూర్చాడు. పేదరికం వాళ్ళ నోరు నొక్కింది. అయినా గంగమ్మ భవిష్యత్తు ఏమౌతుందోనని భయపడ్డారు. నాయుడికి పెళ్ళి జరిగి పిల్లలు పుట్టిన తరవాత ఒక సంబంధం చూసి బలవంతంగా సింహాచలం కొండమీద గంగమ్మకి పెళ్ళి చేశారు. శోభనం నాటి రాత్రి చెప్పాపెట్టకుండా పెళ్ళికొడుకు ముఖమైనా చూడకుండా వాళ్ళవూరు చేరుకుంది.

వార్త వూరంతా గుప్పుమంది. గంగమ్మపెళ్లి మూన్నాళ్ల ముచ్చటగా కూడా మిగల్లేదు. తరవాత విడాకులు తీసుకుంది. అంతే దాని ఖర్మ అని ఆమె యింట్లో వాళ్ళు వదిలేశారు.

నలభైయేళ్ళ సుదీర్ఘకాలం ఎవ్వరికోసం ఎదురు చూడలేదు. తన పని తాను చేసుకుపోయింది. గంగమ్మ తల్లిదండ్రులు పోయారు. చెల్లెలు కాపరానికి పోయింది. తమ్ముడు టాటానగర్‌లో ఉద్యోగం వచ్చి వెళ్ళిపోయాడు. వాళ్ళు వదలేసిన కమ్మల యిల్లు వూరి చివర్లోనూ, నాయుడ్ని నమ్ముకున్న గంగమ్మ ఆ యింట్లోనూ మిగిలిపోయారు.

కొందరు గంగమ్మని చూసి జాలిపడేవారు. పాపం అనుకునేవారు. బాగా చనువున్న వాళ్ళు ''నీకీ కరమ్మేటే. దిక్కుమాలిన దాన్లాగ యీ బాధ లేటే. మీ తమ్ముడి దగ్గరికి పోరాదట్టే. తగులుకున్నోడు మొగుడాతాడా. తాటిసెట్టు నీడాతాదా?'' అనేవారు.

గంగమ్మకి తనని దిక్కుమాలినది అని ఎవరైనా అంటే కోపం వచ్చేది. కారణం ఏనాడూ గంగమ్మ దేనికీ బాధపడలేదు. ఆ ఎగతాళి చేసే అందరికన్నా సుఖంగా వుండేది.

నాయుడు గంగమ్మకి ఏ లోటూ రానిచ్చే వాడు కాదు. అందుకే అలాంటివాళ్ళలో ''అదుగో ఆ మాటె అనొద్దు. నీకున్నదేటి. నాకు లేందేటి. నాయుడు మా రాజుండగా నాను దిక్కుమాలిన దాన్నెప్పుడూ కాను. ఆ దేవుడు నాయుడుబాబు కన్నా నన్ను ముందు తీసుప్పోవాల. ఆ గుళ్ళో రావుడు నా కన్నాయం సెయ్యడు'' అనేది.

రామస్వామినాయుడు కూడా గంగమ్మ వృద్ధాప్యం, అవసాన కాలం గురించి ఆలోచించేవాడు. ఏదైనా శాశ్వత పరిష్కారం గురించి ఆలోచించేవాడు. నాయుడుకి తాను అపురూపంగా కట్టిన భవనంలో లేని సుఖం గంగమ్మ కమ్మల యింట్లో పొందేవాడు. గంగమ్మ ఒడిలో అలసటంతా మరిచి సేద తీరేవాడు.

ఒకమారు ''ఎలాగే గంగమ్మా. నేనుపోతే నిన్నెవరు చూస్తారే. అనాధవైపోతావని బెంగగా వుందే'' అన్నాడు కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ.

అతని మాట పూర్తవక మునుపే నాయుడి నోరు మూసి ''అంత మాటనకయ్యా! నానే ముందు పోతాను. నువ్వు పుస్తెలు కట్టకపోయినా నీ పెళ్ళాన్ని. పునిస్త్రీ సావే సత్తాను. అనగొడదగాని నువ్వేగనక ముందుపోతే నాకు ఆ గన్నేరు పప్పుంది'' అని ఏడ్చేసింది ఒకర్నొకరు కౌగిలించుకుని చాలాసేపు బాధపడ్డారు.

నాయుడు ఆలోచిస్తూనే వున్నాడు కన్నీరు వరదలా కారుతుంది. చుట్టూ మూగివున్న వాళ్ళు గుండెనొప్పి వల్లనేమో అనుకున్నారు.

గంగమ్మకి శాశ్వత పరిష్కారం చేసే సమయం వచ్చిందని తెలుసుకున్నాడు. పక్కనే వున్న వాళ్ళబ్బాయికి సౌజ్ఞ చేశాడు. దగ్గరికి రమ్మని పిలిచాడు.

ఏం చెపుతాడోనని అందరూ కబుర్లాపి మౌనం దాల్చారు.

''సీను బాబూ!''పిలిచాడు.


''ఏం నాన్నా ఏం కావాలి. డాక్టరు నీకింకేం పరవాలేదన్నాడు'' అని చెవి దగ్గర చెప్పాడు.

''నాకు తెలుసునురా! అందుకు కాదు పిలిచింది. నువ్వు వెంటనే మన జాంపండుని పిలిపించు'' అని చెప్పాడు.

నాయుడిగారి మనవడిది చాంతాండంత పేరు. వీరసత్య జగన్నాధ శివ కేశవ అని యింకా చాలా పేర్లున్నాయి. అన్నిటికీ చివర ప్రసాద్ వుంది. అందరూ ప్రసాద్ అని పిలుస్తారు. నాయుడుమాత్రం మనవణ్ని ''జాంపండూ'' అని పిలుస్తాడు.

కారణం చిన్నప్పుడు తాతయ్యా పొలం నుంచి రాగానే ''తాతయ్యా జాంపండు చెచ్చావా?'' అని ముద్దుగా అడిగేవాడు.

రామస్వామి నాయుడు ఏ పని మరిచిపోయినా మనవడికి జాంపళ్ళు తేవడం మరిచేవాడు కాదు. అందుకని మనవడికి




జాంపండు అని ముద్దుపేరు పెట్టుకున్నాడు. తాతయ్య చేత ''ఒరే! జాంపండూ'' అని పిలిపించుకోవడం ఎంత పెద్దవాడయి యింజనీరైనా ప్రసాద్‌కి యిష్టం.


వాళ్ళబ్బాయి శ్రీను కళ్ళు చెమర్చి గద్గద కంఠంతో ''ప్రసాద్‌కి టెలిగ్రాం యిచ్చాం నాన్నా రేపొద్దుటికల్లా వచ్చేస్తాడు'' అని చెప్పాడు.

నాయుడు కళ్ళు మూసుకున్నాడు. గంగమ్మ కళ్ళలో కదలాడింది. ఈ కబురు తెలిస్తే తట్టుకోలేదు. ఏడుస్తూ ఎదురుతెన్నులు చూస్తుంది. కబురు తెలిస్తే వచ్చేసేది. ఇంట్లో గంగమ్మని అందరూ అవమానించారు. ''బయట ఎలాగైనా పొండి. నువ్వీ గడప యింకెప్పుడూ తొక్కకు'' అని కట్టడి చేశారు. అందుకనే వచ్చివుండదు.

మరునాడు ఉదయం పదిగంటలకి ప్రసాద్ హైదరాబాదు నుండి గోదావరిలో బయలుదేరి అనకాపల్లిలో దిగి వూరు చేరుకున్నాడు.

కాళ్ళయినా కడుక్కోకుండా నడవలోని మంచం మీద తాతయ్యని చూశాడు. దుప్పటి ఒంటి మీద కప్పివుంది. నాయుడు కళ్ళు మూసుకుని నిద్రపోతున్నాడు. అక్కడే

## తెలుగులో కాజోల్



ఈ సంవత్సరాంతానికి అజయ్‌దేవ్‌గన్‌ని కాజోల్ పెళ్లాడేసి సినిమాలకు గుడ్‌బై చెప్పేస్తుందని ఇటీవల వరకూ తెగ ప్రచారం అయింది. కానీ ఆ వార్తలన్నింటికీ తెర వేస్తూ ఇప్పట్లో పెళ్లి వూసు లేదని చెప్పేసిన కాజోల్ వరసగా కొన్ని కొత్త హిందీ చిత్రాలతో పాటు దక్షిణాది చిత్రాలపై కూడా దృష్టి మరలుస్తోంది. తొలిసారిగా కాజోల్ ఓ తెలుగు చిత్రంలో నటించబోతున్నట్టు వార్త. వెంకటేష్ హీరోగా తయారుకానున్న చిత్రంలో కాజోల్ నాయికగా నటించనున్నది. ఈ సినిమాని 'సూర్యవంశం' చిత్రాన్ని నిర్మించిన ఆర్.బి.చౌదరి తీస్తున్నాడు. తమిళంలో 'మిన్సారకనవు' (మెరుపుకలలు) ద్వారా పరిచయమైనా కాజోల్‌కి అంతగా కలిసిరాలేదు. మరి తెలుగులోనైనా దశ తిరుగుతుందేమో!

-జె.ఎం.

పక్కనున్న కుర్చీమీద కూర్చుండిపోయాడు. అందరూ ప్రసాదు చుట్టూ చేరారు. ప్రసాద్ చెల్లెలు యింటల్లుడు, మేనత్త ఆ చుట్టుపక్క వూళ్ళ నుంచి వచ్చినవాళ్ళు వున్నారు.

ప్రసాద్ తాతయ్య గుండెలమీద తడిమాడు.

అలికిడికి రామస్వామినాయుడు కళ్ళు తెరిచాడు. ప్రసాద్‌ని చూశాడు.

''పండూ. ఏమైందిరా నాకు. యిలాగైందేమిరా'' అని కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు.

''భయం లేదు తాతయ్యా. మైల్డ్‌హార్ట్ ఎటాక్ అయివుంటుంది. నిన్ను హైదరాబాదు తీసుకుపోతాను. మంచి ట్రీట్‌మెంటు యిప్పిస్తాను'' అన్నాడు. ఎంత నిబ్బరంగా అన్నా ప్రసాద్ గొంతు కాస్త వణికింది. తాతయ్యంటేప్రాణం. ఆయన గుండెల మీద పెరిగాడు. తాతయ్య ప్రోత్సాహం లేకపోతే తను ఇంజనీరయ్యేవాడే కాదు.

''ఒరే పండూ నిన్ను పిలిపించింది నన్ను హైదరాబాదు తీసుకెళతావనీ గుండె జబ్బు నయం చేయిస్తావనీ కాదురా. నీకో భారం మోపడానికి. తరవాత నేనేమైనా పరవాలేదు.'' అన్నాడు ఆయాసంగా.

''చెప్పుతాతయ్యా. ఏం చెయ్యమంటావు. నువ్వేది చెపితే అది చేస్తాను. నీకోసం ఏమయినా చేస్తాను తాతయ్యా చెప్పు'' అని తొందరచేశాడు.

నాయుడికి అందరిముందూ మనసులోని మాట చెప్పడం యిష్టం లేదు. అందర్నీ అక్కడ్నుంచి పంపించెయ్యమని సౌజ్ఞ చేశాడు. ప్రసాద్ అందర్నీ పంపించేశాడు.

''ఇప్పుడు చెప్పు తాతయ్యా, నన్నేం చెయ్యమంటావు'' అడిగాడు.

''పండూ ఇంక నేనెక్కువ రోజులు బతకన్రా. నా రోజులు దగ్గరపడ్డాయి. నా తరవాత గంగమ్మ అన్యాయమైపోద్ది. నన్నే నమ్ముకుని బతుకుతున్న దాని గురించే నా దిగులు. నువ్వు దానికేమైనా చెయ్యాలిరా'' చెప్పాడు.

ప్రసాద్‌కి గంగమ్మ జ్ఞాపకం వచ్చింది. చిన్నప్పుడు తాతయ్యతో గంగమ్మ యింటికి ఎన్నోమార్లు వెళ్ళాడు. ఎంత ముద్దించేదీ. కాయాపండూ ఏదుంటే అది పెట్టేది. ఇంట్లో వాళ్ళకి గంగమ్మంటే యిష్టం లేకపోయినా తనకి గంగమ్మంటే యిష్టమే. తాతయ్యకీ, గంగమ్మకీ గల సంబంధం తనకి తెలియని నాటి నుంచీ వుంది. గంగమ్మ బాధ్యత తాతయ్యది. పాపం తాతయ్య తరువాత ఆమె గతి ఏమిటి. వయసులో చేసిన తప్పుకి, పెళ్ళి చేసుకోకుండా తాళి లేకుండా ఒక వ్యక్తిని నమ్ముకుని బ్రతికేవాళ్ళ బ్రతుక్కి పర్యవసానం యిలాగే వుంటుంది. పాపం గంగమ్మ అనుకున్నాడు.

''గంగమ్మ యింకా రాలేదా తాతయ్యా'' అడిగాడు.

''లేదురా కబురయినా తెలిసిందో లేదో''

# స్నేహలత

**కె. రాజు**
వయసు 20 సం.లు. చదువు: ఐటిఐ. పత్రికలు చదవడం, సినిమాలు చూడడం హాబీలు. అడ్రసు: ఇంటి నం.52-బి, లెక్చరర్స్ కాలనీ, హయత్ నగర్, హైదరాబాద్-501505

**జి.విజయకుమార్ గౌడ్**
వయసు 18 సం.లు. చదువు ఇంటర్. కారమ్స్ ఆడడం, కలం స్నేహం హాబీలు. అడ్రసు:ఇంటి నం.25/16-7, కొండ పేట, గుత్తి రోడ్, డోన్ పోస్టు, కర్నూలు జిల్లా

**యు.శ్రీనివాసరావు**
వయసు 22 సం.లు చదువు: బి.ఏ.ద్వితీయ. పత్రికలు చదవడం, సినిమాలు చూడడం హాబీలు. అడ్రసు: రథం వీధి, నందిగామ పోస్టు, కృష్ణా జిల్లా.

**ఎన్.సి.రామచంద్రారెడ్డి**
వయసు 26 సం.లు. పత్రికలు చదవడం, సినిమాలు చూడడం హాబీలు. అడ్రసు- 117, ఎస్.ఎస్.ఆటోమొబైల్స్, ఇ.ఇ.ఎం. 9వ బ్లాక్, జయానగర్, బెంగుళూరు-560069

**డా.ఎస్.చంద్రకుమార్**
వయసు 27 సం.లు. చదువు: బిఎస్సీ, డిఐఎంఎస్. పత్రికలు చదవడం హాబీ. అడ్రసు-శ్రీవెంకటేశ్వర క్లినిక్, ఎన్.ఎస్.గేట్, సి.కె.పల్లి, అనంతపురం.

**పి.శంకర్ ప్రసాద్**
వయసు 20 సం.లు. చదువు ఎస్సెస్సీ. సినిమాలు చూడడం హాబీ. అడ్రసు ఇంటి నం.5-1-12, రాజా వీధి, భద్రాచలం-507111

**ఆర్.శ్రీధర్ కుమార్**
వయసు 18 సం.లు. చదువు ఇంటర్. పుస్తకపఠనం, కలంస్నేహం హాబీలు. అడ్రసు:సన్నాఫ్ నర్సయ్య, ఇంటి నెం.15-164, తిప్పర్తి రోడ్, నకిరేకల్-508 211

**ఎ.శ్రీనివాస్**
వయసు 23 సం.లు. చదువు బి.ఎ. పత్రికలు చదవడం హాబీ. అడ్రసు:ఇంటి నం.సి-78, దరూర్ కాంప్, జగిత్యాల-505 455

**ఎ.విశ్వనాథరెడ్డి**
వయసు 23 సం.లు. చదువు బి.టెక్. పత్రికలు చదవడం, సినిమాలు చూడడం, ప్రకృతి ఆరాధన హాబీలు. అడ్రసు:ఫ్లాట్ నం.108, అభ్యుదయ అపార్ట్‌మెంట్స్, హుడా కాంప్లెక్స్, కొత్తపేట, హైదరాబాద్-35

**కె.అశోక్ కుమార్**
వయసు 23 సం.లు. చదువు: బిఎస్సీ, ఎండిహెచ్‌డబ్ల్యు. పుస్తకపఠనం, ప్రకృతి ఆరాధన హాబీలు. అడ్రసు:ఇంటి నం.1-12-61/2, వినాయకనగర్, నిజామాబాద్.

**జి.శివ ప్రసాద్**
వయసు 18 సం.లు. చదువు- ఇంటర్. పుస్తకపఠనం. ప్రకృతి ఆరాధన హాబీలు. అడ్రసు-సన్నాఫ్ ఈరయ్య, ఎం.ఐ.జి. 121, ఆదోని-518302

అన్నాడు నీరసంగా. ఆయాసం ముంచుకొచ్చింది.

''ఇప్పుడే వస్తానుండు తాతయ్యా'' అని దిగ్గున లేచాడు. గంగమ్మ కమ్మలయిల్లు నాయుడింటికి రెండు ఫర్లాంగుల దూరం కూడా లేదు. ఏదో లోకం నుంచి వూడి పడ్డట్టు అలికిడికి వులిక్కిపడింది గంగమ్మ. ఎదురుగా ప్రసాద్!

''పెసాదు బాబూ. ఎప్పుడొచ్చినావు. మీ తాతయ్యకెలా గుంది. మంచి వొయిద్యం చేయించి పున్నెం కట్టుకో బాబూ'' ఏడ్వడం మొదలుపెట్టింది.

''గంగమ్మా! త్వరగా రా. తాతయ్య నిన్ను తీసుకు రమ్మన్నారు'' అన్నాడు.

''నన్నా అక్కడికా మీవోలూరుకుంతారా బాబూ'' అంది భయంగా.

''మా వాళ్ళెవరు. నేను తీసుకెళతాను రా'' అని తొందర చేశాడు.

గబగబా వున్నపళంగా తలుపులు మూసి బయలుదేరింది. పరుగు పరుగున నాయుడి గారి యిల్లు చేరుకుంది. నాయుడి మంచం మీద పడి మౌనంగా రోదించింది. నాయుడు మౌనంగా తలమీద చెయ్యి వేసి నిమురుతూ ''ఊరుకో'' అన్నాడు మెల్లగా. కళ్ళ నీళ్ళు నిండుకోగా తువ్వాలుతో కళ్ళు వత్తుకున్నాడు.

ఇంట్లో వాళ్ళ ముఖాలు మాడి వున్నాయి. గంగమ్మ అలాగ రావడం వాళ్ళ కిష్టం లేదు మరి!


ఇరుగు పొరుగు చోద్యం చూస్తున్నట్టు చూశారు.

వారికది చోద్యంగా కనిపించినా వివాహ బంధం లేకపోయినా ఓ పవిత్రబంధం తన మహిమని చూపించిన అపూర్వ సంఘటనగా అది మిగిలిపోయింది.

ప్రసాద్ చూస్తూ వుండగానే వాళ్ళ తాతయ్యకి మళ్ళీ చెమట్లు కమ్మాయి. విద్యావంతుడు గనక మళ్ళీ స్ట్రోక్ రాబోతున్నదని అర్థం చేసుకున్నాడు. తాతయ్యకి ఆత్మశాంతి కలిగించాలి.

''తాతయ్యా, నీకోరిక ప్రకారం నేను గంగమ్మ పోషణ భారం తీసుకుంటాను. గంగమ్మ నాకింకో నాయనమ్మ. నా మాట నమ్ము'' అని చెవిలో గట్టిగా చెప్పాడు.

రామస్వామినాయుడు చేతులు అతికష్టం మీద బార సాచి మనవడ్ని ఆలింగనం చేసుకుని ''పండూ'' అని ప్రాణాలు వదిలాడు. అందరూ ఏడ్చారు. గంగమ్మని ఎవ్వరూ ఓదార్చలేకపోయారు.



## మధుబాల బాధ!

మధుబాల చిన్న తనంలోనే ఆమె తన తల్లిని కోల్పోయింది. ఆమె తండ్రే ఆమెకి తల్లీ తండ్రీ అయి పెంచాడు. తల్లి ప్రేమలోని ఆప్యాయతానురాగాలను మధుబాల చవిచూడలేకపోయింది. తనకి ఇలాంటి మనోవేదన కలగడానికి కారణం తన తల్లి అకాల మరణమే! కాన్సర్ మహమ్మారితో అర్థాంతర చావుకి గురైన తన తల్లి గుర్తొచ్చినప్పుడల్లా తనకెంతో బాధ కలుగుతుందని ఇటీవల విచారంగా చెప్పింది మధుబాల. అందుకనే కాన్సర్‌కి అమాయకుల బలిని అరికట్టడం కోసం తనవంతు ఏదైనా ఓ మంచి కార్యక్రమాన్ని తలపెట్టాలని వుందంటోంది మధుబాల. ఆమె ఆలోచన మంచిదే అని ఎవరైనా అంటారు. మరి మనసుపడిన వరుడ్ని మనువాడాక ఈ విషయంలో సీరియస్‌గా వర్కవుట్ చేస్తుందేమో! ఆల్ ది బెస్ట్!

-జె.ఎం.

నాయుడి అంత్యక్రియలు పెద్ద ఖర్మ ఘనంగా చేశారు. ప్రసాద్ రేపు హైదరాబాదు ప్రయాణమవగా గంగమ్మను తనతో హైదరాబాదు రావడానికి సిద్ధంగా వుండమన్నాడు.

గంగమ్మ వస్తాననిగాని, రాననిగాని చెప్పలేదు.

మరునాడు పొద్దున్నే గంగమ్మ యింటికి వెళ్ళాడు.

''గంగమ్మా'' అని పిలిచాడు. ఎక్కడికైనా వెళ్ళిందేమో అనుకున్నాడు. తలుపులుబార్లా తెరిచే వున్నాయి. లోపలికెళ్లాడు. గంగమ్మ మంచం మీద పడుకునివుంది.

గబగబా బయటికి వచ్చాడు.

రుబ్బురోలు దగ్గర గన్నేరు కాయల తొక్కలు పిక్కలు దంచిన పప్పు చూశాడు. గన్నేరు పప్పు రాత్రి తిని నిద్రపోయిందని, ప్రాణాలు తీసుకుందని తెలుసుకోడానికి ఎంతో సేపుపట్టలేదు.

''ఎంతపని చేశావు గంగమ్మా!'' అనుకున్నాడు.

తాతయ్య పోయినప్పుడు కూడా రానంత దుఃఖం తన్నుకొచ్చింది ప్రసాద్‌కి. వెక్కి వెక్కి ఏడ్చాడు.

గంగమ్మ ఒక దేవతలాగా అనిపించింది. భర్త చనిపోయినా ఏడ్చి వూరుకునే మహాపతివ్రతలున్న ఈరోజుల్లో, ఎంత ఆస్తి మిగిల్చాడని చూసే పుస్తెకట్టిన పెళ్ళాలున్న యీరోజుల్లో, పుస్తెకట్టకుండానే భర్తగా భావించి సహగమనం చేసిన గంగమ్మ మహాపతివ్రతలాగా అనిపించింది ప్రసాద్‌కి. సెలవు పొడిగించుకుని అంత్యక్రియలు అన్నీ ఘనంగా జరిపించాడు గంగమ్మకి ప్రసాద్. భారమైన గుండెతో నాయుడుతో పాటు గంగమ్మకీ వీడ్కోలు చెబుతూ హైదరాబాదు బయల్దేరాడు.

★